PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

గురువారం 15-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :135 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## సీజేపీకి రాహుల్ గాంధీ మద్దతు.. ధన్యవాదాలు తెలిపిన దీప్కే

జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంఘీభావం తెలిపారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని కేంద్రాన్ని విమర్శించారు. “జాతీయ జెండాను ప్రదర్శిస్తూ శాంతియుతంగా నిరసన తెలపడం నేరం కాదు.


2లో

## ఇరాన్‌పై మళ్లీ దాడులకు ట్రంప్- బీబీ రహస్య చర్చలు!

అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారులు సైతం ఇజ్రాయెల్ ఆలోచనకు మద్దతు తెలిపారు. నవంబర్‌లో అమెరికాలో ఎన్నికలు ఉండడంతో ఈ దాడుల ప్రభావం వాటిపై పడే అవకాశం ఉందని ట్రంప్ సలహాదారులు ఆయనకు సూచించడంతో అమెరికా అధ్యక్షుడు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.


2లో

# తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీఎం

- యువత, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి..
- పెట్టుబడులకు ప్రభుత్వ భరోసా: ముఖ్యమంత్రి




## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల



అమరావతి: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఈమేరకు షెడ్యూల్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ప్రకటించారు. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

# మంచి పాలసీతో ఎవరు వచ్చినా.. ప్రోత్సహిస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి

**హైటెక్స్ వేదికగా సమాఖ్య-2026 గ్లోబల్ బిజినెస్ మీట్ జరిగింది.**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. సమాఖ్య చేస్తున్న కృషిని అభినందించారు. జనాభా శాతాన్ని మించి తెలంగాణ రాష్ట్రం జీడీపీకి తన వాటా అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదన్నారు.



## సర్‌కు వ్యతిరేకంగా 2 లక్షల మందితో మార్చ్: టీపీసీసీ చీఫ్

మిగతాది 2లో


2లో

సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ దసరా తర్వాత హైదరాబాద్‌లో రెండు లక్షల మందితో మార్చ్‌తో పాటు భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

## వచ్చే బతుకమ్మ నాటికి ఇందిరమ్మ ఇళ్ల అప్పగింత: మంత్రి పొంగులేటి

**తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు.**

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ వివక్షకు తావులేదని, అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అర్హులైన పేదలందరికీ ఇళ్లు కేటాయిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.


2లో

## జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం



హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీబీఐ కేసులతోపాటు ఈడీ కేసులనూ రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయం తీసుకుంది. రోజువారీ విచారణకు హాజరుకావాలని ఈడీ న్యాయవాదులకు సూచించింది. సీబీఐ కోర్టులో పదేళ్లుగా 9 ఈడీ ఛార్జిషీట్లు పెండింగ్‌లో ఉన్నాయి. డిశ్చార్జి పిటిషన్లు తేలకపోవడంతో ఈడీ కేసుల విచారణ ముందుకు సాగడం లేదు. ఈడీ కేసులను రోజువారీగా విచారించాలని ఇప్పటికే హైకోర్టును అధికారులు ఆశ్రయించారు.

## జనసేనలో చేరిన వంగవీటి రాధాకృష్ణ

మంగళగిరి: మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ఆయనకు కండువా కప్పి తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బుధవారం సాయంత్రం పార్టీలో చేరేందుకు వంగవీటి రాధా జనసేన కేంద్ర కార్యాలయానికి రాగా.. పవన్ ఆయన్ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని స్వాగతం పలికారు. అనంతరం ఆయన తన అనుచరులను పవన్‌కు పరిచయం చేశారు.



# సంపాదకీయం

## లంచాల్లో మనం విశ్వగురువులం!

ప్రతివారం ఇద్దరో ముగ్గురో ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ దాడుల్లో పట్టుబడుతూనే ఉన్నారు. సాధారణంగా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో చట్టాన్ని ఉల్లంఘించడానికో, తప్పులు చేయడానికో లంచం అడుగుతారు. కానీ, చట్టబద్ధంగా చేయాల్సిన పనిని నిర్వర్తించడానికి సైతం లంచం డిమాండ్ చేసే సంస్కృతి మన దేశంలో మాత్రమే కనిపిస్తోంది! మన ప్రభుత్వోద్యోగులు తాము నిర్వర్తించాల్సిన అధికారిక బాధ్యతను వ్యక్తిగత ఆదాయ మార్గంగా మార్చుకుని, లంచం ఇవ్వగలిగే వారికే సేవలు అందించడం ప్రారంభించి చాలా కాలమైంది. నిత్యం ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చే సామాన్యులకు ఈ అవినీతి తీవ్రత, దాని విస్తృతి ఎంత దారుణంగా ఉన్నాయో స్పష్టంగా తెలుసు.

సమాజంలో మధ్యతరగతి వర్గానికి ఈ అవినీతి అసలు ఒక సమస్యగానే కనిపించకపోవచ్చు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కోట్లు వెచ్చించి గేటెడ్ కమ్యూనిటీల్లో ఇళ్లు కొంటున్నారు, పిల్లలను విదేశాల్లో చదివిస్తున్నారు, నూతన దంపతుల హనీమూన్‌ను మాల్దీవులలో ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ కేవలం తమ నెల జీతంతోనే సాధించామని చెప్పే స్థితి లేదు. మరోవైపు, 'ఇప్పటికీ అద్దె కొంపలోనే ఉన్నాం' అని ఆవేదన చెందే గృహిణి, తన భర్త నిజాయితీని మెచ్చుకోవడానికి బదులు అతని చేతగానితనాన్ని ఎత్తి చూపుతుంది. 'కుటుంబంలో ఒక్కరికి సర్కారీ కొలువు వస్తే, వంశమంతా బాగుపడింది' అనే మెచ్చుకోలు వెనుక బినామీ ఆస్తులు, అవినీతి సంపాదనతో కూడిన లోతైన లంకె దాగి ఉంది.

'ఆ ఐఏఎస్ అధికారి మంచి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు' అనే వార్తలు, సమాజంలో అవినీతి ఏ స్థాయిలో సాధారణీకరణ అయిందో చాటి చెబుతున్నాయి. 'ఆదాయం వచ్చే సీటు మారితే నెలకు లక్షల్లో నష్టం జరుగుతుంది' అనే వారిలో, లంచాన్ని తమ హక్కుగా భావించే తీరు కనిపిస్తుంది. 'అందరూ చేసే పనే కదా!' అనే మాటలో అవినీతికి సమర్థన లభిస్తుండగా.. 'నేనొక్కడినే తిన్నానా? పైన ఉన్న వారికీ తినిపించలేదా?' అనే వాదనల్లో అవినీతి ముఠాల అక్రమ వలయం స్పష్టమవుతోంది. 'నీతిగా ఉండటానికి నేనేమైనా గాంధీనా?' అనే సమాధానం చూస్తే, నేటి సమాజంలో నిజాయితీ ఎంత అరుదైన విషయంగా, చులకనగా మారిపోయిందో అర్థమవుతుంది.

పదవీ విరమణ చేసిన తరువాత గౌరవంగా విశ్రాంతి తీసుకోకుండా, ఎన్నికల వైపు లంఘించేవారు దానిని ఒక సహజ పరిణామంగా చిత్రీకరిస్తున్నారు! ఇటువంటి వారు రాజకీయాల్లో చేరుతున్నంత కాలం, ప్రభుత్వం అవినీతికి వ్యతిరేకమని నమ్మడం కష్టం. అలాగే, విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చి కోట్లు ఆర్జించిన వ్యక్తులు, సేవ చేయడానికే రాజకీయాల్లోకి వస్తున్నారని ఎవరూ నమ్మడం లేదు. నీతిగా బతకడం అంటే జీవితంలో ఓడిపోవడమే అని భావించే సమాజంలో, అధికారంలో ఉన్నవారు పదే పదే గెలుస్తుంటే వారు లంచాలు తిననట్టా? లేదా ఇతరులకు తినిపించనట్టా? మనకు చూపిస్తున్న దృశ్యం వెనుక ఉన్న వాస్తవాన్ని ఎందుకు గుర్తించలేకపోతున్నాం?

ఏదైనా ఒక శాఖలోని ఉద్యోగి అవినీతి సొమ్ముతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడినప్పుడు-- 'ఇది మా శాఖకు ఎంతో చెడ్డపేరు తెచ్చిపెట్టింది' అని బహిరంగంగా ఖండించిన మంత్రులు ఉన్నారా? లేరు. వారి ఈ మౌనం వెనుక దాగి ఉన్న నిండు సత్యాలేమిటి? ఒక లాభసాటి పదవిని ఎలా దక్కించుకోవాలో, ఆ సీటులో కూర్చుని ఎవరు ఏ స్థాయిలో చెలరేగిపోతున్నారో సంభ్రమాశ్చర్యాలతో చర్చించుకునే ముఠాలకు అధికార కారిడార్లలో కొదవలేదు. అవినీతిని ఒక కళాత్మక నైపుణ్య స్థాయికి తీసుకెళ్లిన వారి పట్ల సమాజంలోనూ, తోటి అధికారుల్లోనూ ఒక రకమైన గౌరవం పెరిగిపోతోంది. ప్రత్యేక శిక్షణ లేకుండానే లంచాల ఆర్జనలో ఇటువంటి 'నైపుణ్యం' సాధించడం సాధ్యం కాదు. ఇలాంటి అధికారులకు ఇతర శాఖల నుంచి కూడా తీవ్రమైన డిమాండ్ ఉంటుంది! నిబంధనలను పక్కనపెట్టి నిధులు రాబట్టగల నేర్పరులైన ఇటువంటి అధికారులను వెతికి మరీ మంత్రుల పేషీల్లో ప్రత్యేక అధికారులుగానో, సలహాదారులుగానో నియమించుకుంటున్నప్పుడు.. సాదాసీదా ఉద్యోగి మాత్రం మేతమేయకుండా గట్టు మీద కూర్చుంటాడా? నిఘా వ్యవస్థలు కునుకు తీస్తున్నప్పుడు ఆ ఉద్యోగి హఠాత్తుగా కోట్లు పోగేసినట్టు చెప్పడం కుదురుతుందా? 'వేల కోట్లు కొల్లగొట్టిన బడా తిమింగలాలను వదిలేసి, కేవలం వందల కోట్లు కూడబెట్టిన చిన్న చేపలను మాత్రమే పట్టుకున్నారు' అనే విమర్శే ఇక్కడ సత్యానికి చాలా దగ్గరగా ఉంటుంది. అంతేకాదు, 'ఒకవేళ నిజంగా అవినీతి ప్రక్షాళన మొదలుపెడితే అసలు ఎంతమందిని ఉద్యోగాల నుంచి తొలగించగలం? అందుకే ఒక పరిమితి దాటకుండా అవినీతిని అదుపు చేయడమే ప్రభుత్వ బాధ్యత' అంటూ ఒక అగ్రనేత చేసే ప్రకటనలోని నిజాయితీని చూడాలి. వంద రూపాయల లావాదేవీలో పది రూపాయల అవినీతి ఆమోదయోగ్యమే అయితే.. అదే ప్రాతిపదికన లక్ష కోట్ల బడ్జెట్‌లో పదివేల కోట్ల అవినీతి కూడా సహజంగానే ఆమోదనీయం అవుతుంది కదా?

అణగారిన వర్గాలు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని పడే ఆరాటం కేవలం సామాజిక గుర్తింపు కోసమే అయి ఉంటే ఎంత బాగుండేదో! అధికారం అనేది ప్రజలందరి ఉమ్మడి వనరు అని, పుట్టుక నుంచి చావు వరకు సామాన్యుడికి దాంతో అవసరం పడుతుందనే స్పృహ అందరికీ ఉంది. కానీ అదే సమయంలో, ప్రభుత్వంపైనే పూర్తిగా ఆధారపడే బలహీన వర్గాల కష్టార్జితాన్ని అధికార బలంతో ఎలా ఒడుపుగా పిండుకోవచ్చో అనే తెలివితేటలు కూడా ఉద్యోగులలో పెరిగిపోతున్నాయి.

అవినీతిని అర్థం చేసుకోవడానికి దానికి ఉన్న సామాజిక సందర్భాన్ని కూడా పరిశీలించాలి. నేటి మధ్యతరగతిని ఒక కొత్త ఆకర్షణల ప్రపంచం ఆహ్వానిస్తోంది. అయితే అది శ్రీశ్రీ ఊహించిన 'మరో ప్రపంచం' కాదు. భౌతిక సుఖాలు, విలాసవంతమైన జీవితపు కొత్త రుచుల ప్రపంచం! ఫామ్‌హౌస్‌లు, విదేశీ విద్యలు, అట్టహాసంగా జరిగే డెస్టినేషన్ వెడ్డింగ్‌లు వారిని ఊరిస్తున్నాయి. థాయ్‌లాండ్, వియత్నాం, దుబాయ్, లాస్ ఏంజెల్స్ వంటి విదేశీ తీర్థాల నుంచి.. మానససరోవరం, అయోధ్య, కేదారనాథ్, పశుపతినాథ్‌ల ఆధ్యాత్మిక గమ్యస్థానాల వరకు అన్నీ ఆకర్షిస్తున్నాయి. కేవలం సాధారణ ఉద్యోగాల నెలసరి జీతాలతోనే ఈ ఖరీదైన గమ్యాలను చేరుకోవాలనుకోవడం అమాయకత్వమే అవుతుంది. ఒకవైపు ఇటువంటి విలాసవంతమైన జీవనశైలిని ప్రోత్సహించి, ఆరాధించి, సమాజంలో గౌరవాలు కట్టబెడుతూ.. తీరా ఆ హోదా కోసం అక్రమంగా నోట్ల కట్టల శిఖరాలను అధిరోహించిన వారిని 'నూరు తప్పులు చేశారు' అని వేలెత్తి చూపడం తర్కానికి అందని విషయం. నిజానికి నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం చుట్టూ తిరిగే కథలు చాలా మందికి స్ఫూర్తిని ఇస్తున్నాయేమో చూడాలి.

వ్యవస్థ తనకు లేని విశ్వసనీయతను ఉన్నట్టు ప్రదర్శించడానికి చేసే ప్రయత్నం ఫలిస్తున్న దాఖలా లేదు. కెమెరాల ముందు నోట్ల కట్టలను లెక్కించడం సులభమే కావచ్చు కానీ, ఆ సంపద వెనుక ఉన్న సూత్రధారులను, బినామీ వ్యవస్థల అసలు రూపాన్ని బయటకు తీయడం అంత తేలిక కాదు. 'అయినప్పటికీ రైడుకు పోయిరావలెను...' అంటూ సాగే ఈ విఫల నాటకాన్ని రక్తి కట్టించడం సాధ్యం కాదు. ఈ ముసుగు నాటకం ఆడక తప్పకపోవచ్చు. కానీ, జీవితంలో ఎదగడం అంటే కేవలం ఆస్తులు, సంపద పోగేయడమే అని భావించే నైతిక దారిద్ర్యం ఉన్నంత కాలం.. సమాజం అనివార్యంగా ఈ అవినీతి సుడిగుండంలోకి జారిపోతూనే ఉంటుంది. తప్పని తెలిసే ఈ తంతు సాగిపోతోంది. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలోనే రాజోద్యోగులు పాల్పడే నలభై రకాల అక్రమాలను 'అర్థశాస్త్ర' కర్త కౌటిల్యుడు గుర్తించాడు. అయితే, నాటి ఆ ఘనమైన వారసత్వాన్ని నేడు యథావిధిగా కొనసాగిస్తున్న వారిని సమాజం జాతిరత్నాలు అంటుంటే, చట్టం మాత్రం మొక్కుబడిగా 'అవినీతిపరులు' అంటోంది.

ఇదంతా ఎవరికి తెలియదు? అందరికీ తెలిసిన విషయం ఎందుకు చెప్పాలి? అన్యాయం జరుగుతున్నప్పుడు చూసి కూడా మౌనంగా ఉండేవారికి, అన్యాయానికి పాల్పడిన వారి కంటే ఎక్కువ శిక్ష పడాలని ద్రౌపది అంటుంది. దుర్యోధన దుశ్శాసనులు మదంతో అన్యాయానికి ఒడిగడుతుంటే.. ఆ అన్యాయం తమ కళ్లెదుటే జరుగుతున్నా భీష్మాచార్యులు, ద్రోణాచార్యులు మౌనంగా ఉండిపోవడం మరింత తీవ్రమైన నేరమని మహాభారతం వాదిస్తుంది. లంచం తీసుకునే సాధారణ ఉద్యోగి నేరస్థుడే కావచ్చు, కానీ వ్యవస్థకు ఆమోదయోగ్యంగా మారిపోయిన ఈ సామాజిక-- రాజకీయ అవినీతి సంస్కృతి ముఖ్యంగా పేదలకు ఎంతో ప్రమాదకరమైనది!

## వచ్చే బతుకమ్మ నాటికి ఇందిరమ్మ ఇళ్ల అప్పగింత: మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, అక్టోబర్ 14: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ వివక్షకు తావులేదని, అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అర్హులైన పేదలందరికీ ఇళ్లు కేటాయిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందిరమ్మ టవర్స్ పనులకు 23 నియోజకవర్గాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.

మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఫ్లాట్లు కేటాయిస్తామని, లబ్ధిదారులకు ఫ్లాట్‌తో పాటు భూమిలో వాటాకు సంబంధించిన హక్కులు కూడా కల్పిస్తామని చెప్పారు. అంతేకాకుండా, ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించడమే లక్ష్యమని వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇళ్లను కేటాయిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.440 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇళ్ల కేటాయింపుల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

## సర్‌కు వ్యతిరేకంగా 2 లక్షల మందితో మార్చ్: టీపీసీసీ చీఫ్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, అక్టోబర్14: సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ చేస్తూ దసరా తర్వాత హైదరాబాద్‌లో రెండు లక్షల మందితో మార్చ్‌తో పాటు భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. దక్షిణాదిలో అధికారంలో ఉన్న రెండు రాష్ట్రాల్లో సభలు నిర్వహించాలని పార్టీ హైకమాండ్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. బుధవారం నాంపల్లిలోని గాంధీ భవన్‌లో విలేకర్లతో టీపీసీసీ చీఫ్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మహిళా జర్నలిస్టులను అవమానించారంటూ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేశారని మండిపడ్డారు.ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు రాహుల్ గాంధీ షూ లేస్ కట్టారని గుర్తు చేశారు. భారతీయ జనతా పార్టీ మొలకెత్తడానికి మాజీ ప్రధాని వాజ్‌పేయ్, కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ కారణమని గుర్తు చేశారు. వాళ్లు లేకుంటే బీజేపీ మొలకెత్తేదా? అని వ్యంగ్యంగా అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తామంటే ఎట్లా? అంటూ కేంద్రంలో మోదీ ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ మతతత్వ పార్టీకి వ్యతిరేకంగా ఎవరు పోరాడిన వారికి తాము మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. సీజేపీ, ఇండియా కూటమి ఎవరికి వారే పోరాటం చేస్తున్నాయని వివరించారు. ప్రజాస్వామ్యంలో భాషపై గౌరవం ఉండాలని టీపీసీసీ చీఫ్ చెప్పారు. గత 15 ఏళ్ల నుంచి ఆర్టీసీ ఎన్నికలు లేవని.. అందుకే వాటిని నిర్వహించామని తెలిపారు. ఓడినా గెలిచినా ఆ సంస్థ కార్మికుల శ్రేయస్సుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. పట్టభద్రుల ఎన్నికల్లో విజయం కోసం సీరియస్‌గా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అక్టోబర్ 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డితో పట్టభద్రుల ఎన్నికల సమావేశం ఉంటుందని అన్నారు. దీనికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని అన్నారు.ఎర్రవల్లిలో 45 ఎకరాలు ఎవరి కబ్జాలో ఉన్నాయో విచారణ జరుగుతుందని తెలిపారు. టీఆర్ఎస్ చీఫ్ కవిత.. తన ఫ్యామిలీ గురించి ఎక్కువ వాస్తవాలు చెబుతుందని గుర్తు చేశారు.

## జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీబీఐ కేసులతోపాటు ఈడీ కేసులనూ రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయం తీసుకుంది. రోజువారీ విచారణకు హాజరుకావాలని ఈడీ న్యాయవాదులకు సూచించింది. సీబీఐ కోర్టులో పదేళ్లుగా 9 ఈడీ ఛార్జిషీట్లు పెండింగ్‌లో ఉన్నాయి. డిశ్చార్జి పిటిషన్లు తేలకపోవడంతో ఈడీ కేసుల విచారణ ముందుకు సాగడం లేదు.

ఈడీ కేసులను రోజువారీగా విచారించాలని ఇప్పటికే హైకోర్టును అధికారులు ఆశ్రయించారు. ఇప్పటి వరకూ సీబీఐ కేసులనే న్యాయస్థానం విచారిస్తోంది. తమ కేసులనూ విచారించాలని హైకోర్టులో ఈడీ పిటిషన్ వేసింది. ఈ కేసును త్వరగా తేల్చేలా సీబీఐ న్యాయస్థానాన్ని ఆదేశించాలని కోరింది. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తాజా నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి ఈడీ కేసులను సీబీఐ కోర్టు విచారించే అవకాశం ఉంది.వారితో ఫొటోలు దిగారు. జనసేన పార్టీ సిద్ధాంతాల కోసం కలసికట్టుగా పని చేద్దామని, ప్రజాసేవలో సమష్టిగా ముందుకెళ్దామని ఈ సందర్భంగా పవన్ దిశానిర్దేశం చేశారు.

## సీజేపీకి రాహుల్ గాంధీ మద్దతు.. ధన్యవాదాలు తెలిపిన దీప్కే

మొదటి పేజీ తరువాయి

జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంఘీభావం తెలిపారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అని కేంద్రాన్ని విమర్శించారు. "జాతీయ జెండాను ప్రదర్శిస్తూ శాంతియుతంగా నిరసన తెలపడం నేరం కాదు. అలా చేసిన యువకులపై కేసులు పెట్టి జైలుకు పంపడం ఏంటి? రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడం అందరి బాధ్యత. జంతర్‌మంతర్‌ను తిరిగి నిరసన ప్రదేశంగా సాధించుకుంటాం" అని రాహుల్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రాహుల్ గాంధీ పోస్ట్‌పై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందిస్తూ కాంగ్రెస్ నేతకు ధన్యవాదాలు తెలిపారు. జంతర్ మంతర్‌ను ధర్నా వేదికగా డీనోటిఫై చేస్తూ ఢిల్లీ పోలీసులు ఇటీవల ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని సీజేపీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ క్రమంలోనే సీజేపీ ముఖ్య నేతలు జంతర్ మంతర్ వద్దకు చేరుకుని నిరసనలకు యత్నించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ పోలీసులు వారిని అరెస్టు చేసి జైలుకు తరలించారు.

## ఇరాన్‌పై మళ్లీ దాడులకు ట్రంప్- బీబీ రహస్య చర్చలు!

మొదటి పేజీ తరువాయి

ఇరాన్‌పై భారీ దాడులను పునఃప్రారంభించాలా.. వద్దా? అనే విషయంపై అమెరికా-ఇజ్రాయెల్ రహస్య చర్చలు జరుపుతున్నట్లుగా అంతర్జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అగ్రరాజ్యంలో ఎన్నికలు ముగిసేలోపు (నవంబర్ చివరి నాటికి) టెహ్రాన్‌పై భారీ సైనిక చర్య చేపట్టే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. గత వారం ట్రంప్‌తో సంభాషణలో భాగంగా నెతన్యాహు (బీబీ) ఇరాన్ మళ్లీ అణ్వాయుధాల కోసం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ అణ్వాయుధ శక్తిని నిర్వీర్యం చేయడానికి దాడులను పునఃప్రారంభించేలా ట్రంప్‌ను ఒప్పించేందుకు బీబీ ప్రయత్నిస్తున్నట్లు సదరు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా, ఇరాన్‌లోని పికాక్స్ పర్వతంలోని చమురు శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రణాళికల్లో భాగంగా నెతన్యాహు సలహాను ట్రంప్ అంగీకరించినట్లు సమాచారం. అయితే, దాడులు ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయంపై స్పష్టతనివ్వలేదు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారులు సైతం ఇజ్రాయెల్ ఆలోచనకు మద్దతు తెలిపారు. నవంబర్‌లో అమెరికాలో ఎన్నికలు ఉండడంతో ఈ దాడుల ప్రభావం వాటిపై పడే అవకాశం ఉందని ట్రంప్ సలహాదారులు ఆయనకు సూచించడంతో అమెరికా అధ్యక్షుడు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై దాడుల విషయంలో ట్రంప్ మనసు మార్చుకుంటే వెంటనే దాడులు చేసేలా అమెరికా-ఇరాన్ సైన్యాలు అప్రమత్తమయ్యాయి. ఇందులో భాగంగానే అమెరికా విమాన వాహక నౌకలు సైతం పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు సమాచారం. అయితే, దీనిపై అగ్రరాజ్యం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల

మొదటి పేజీ తరువాయి

అమరావతి: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఈమేరకు షెడ్యూల్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ప్రకటించారు. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

**'పుర' ఎన్నికలు..**

నామినేషన్ల గడువు: అక్టోబరు 18
ఉపసంహరణ గడువు: అక్టోబరు 21
పోలింగ్ తేదీ: అక్టోబరు 28
ఓట్ల లెక్కింపు: అక్టోబరు 30
ఎంపీటీసీ, జడ్పీటీసీ..
నోటిఫికేషన్: అక్టోబరు 19
నామినేషన్ల గడువు: అక్టోబరు 23
ఉపసంహరణ గడువు: అక్టోబరు 27
ఎన్నికల తేదీ: నవంబరు 3
ఓట్ల లెక్కింపు: నవంబరు 5
మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు..

గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 26న మొదటి విడత, 29న రెండో విడత, డిసెంబర్ 2న మూడో విడత జరగనున్నాయి. ఎన్నికలు జరిగిన రోజునే ఓట్ల లెక్కింపు ఉంటుంది.

**తొలి విడత..**

నోటిఫికేషన్: నవంబరు 13 నామినేషన్ల గడువు: నవంబరు 17 ఉపసంహరణ గడువు: నవంబరు 21 పోలింగ్ తేదీ: నవంబరు 26 రెండో విడత.. నోటిఫికేషన్: నవంబరు 16 నామినేషన్ల గడువు: నవంబరు 20 ఉపసంహరణ గడువు: నవంబరు 24 పోలింగ్ తేదీ: నవంబరు 29 మూడో విడత..నోటిఫికేషన్: నవంబరు 19 నామినేషన్ల గడువు: నవంబరు 23 ఉపసంహరణ గడువు: నవంబరు 27 పోలింగ్ తేదీ: డిసెంబరు 2

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

**- అక్టోబర్ 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు**

**- 18 ఏళ్లు నిండిన యువత ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి**



**మెదక్, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతోపాటు, ఓటరు జాబితాలో అర్హులైన పౌరుల పేర్ల నమోదే లక్ష్యంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో అక్టోబర్ 15, 16 తేదీల్లో మెదక్ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు, గతంలో ఓటరుగా నమోదు కానివారు, తొలిసారిగా ఓటు హక్కు పొందనున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి**

18 ఏళ్లు నిండిన అర్హులైన యువతతోపాటు ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు సంబంధిత పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఫారం-6 ద్వారా తమ పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక శిబిరాల నిర్వహణ సమయంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి అవసరమైన మార్గదర్శకాలు, సహాయాన్ని వారు అందిస్తారని పేర్కొన్నారు. ఓటరు నమోదును బాధ్యతగా భావించాలి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడాన్ని బాధ్యతగా భావించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. జిల్లాలోని అర్హులైన పౌరులందరూ అక్టోబర్ 15, 16 తేదీల్లో తమకు సమీపంలోని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలను వినియోగించుకుని ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

# కాఫీ పొడి అట్టపెట్టెల మాటున ఎర్రచందనం అక్రమ రవాణా.. 8 మంది అరెస్ట్

**- 1.984 టన్నుల బరువున్న 70 ఎర్రచందనం దుంగలు స్వాధీనం.. రూ.1.30 కోట్ల విలువైన సొత్తు సీజ్**



**కడప, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** కడప జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఎనిమిది మంది స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేసి, 1.984 టన్నుల బరువున్న 70 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కాఫీ పొడి ప్యాకెట్ల అట్టపెట్టెల లోడులో ఎర్రచందనం దుంగలను దాచి తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ఎస్.ఏ. కాశినాయన మండలం ఆకుల నారాయణపల్లె సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, స్మగ్లర్లు గొడ్డళ్లు, రాళ్లతో దాడికి యత్నించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఘటనలో తమిళనాడుకు చెందిన ఏడుగురితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒకరిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ ముఠాకు సంబంధించిన మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిందితుల నుంచి మూడు వాహనాలు, 643 కాఫీ పొడి అట్టపెట్టెలతో పాటు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు విలువ సుమారు రూ. 1.30 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. పునరావృత నేరాలకు పాల్పడే వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# రీసర్వే పనులు గడువులోగా పూర్తి చేయాలి



**చింతకాని, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్):** జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని లచ్చగూడెం రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రెవెన్యూ రికార్డుల ఆధారంగా రీసర్వే పనులు చేపట్టాలని సూచించారు. సర్వే నిర్వహించే తేదీ, సమయాన్ని సంబంధిత రైతులకు ముందుగానే తెలియజేయాలని స్పష్టం చేశారు. సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా భూముల హద్దులు, ఇతర వివరాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా పరిశీలించేందుకు వీలుంటుందని తెలిపారు. రైతులకు ముందస్తు సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని, రీసర్వే ప్రక్రియలో వారి భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని అధికారులకు సూచించారు. సర్వే పనుల సందర్భంగా ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత కాలపరిమితిలోగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట చింతకాని మండల తహసీల్దార్ కరుణశ్రీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ పంట కోతపై డ్రై రన్ కార్యక్రమం

**35 ఎకరాల్లో పంట కోత.. 10 టన్నుల ఆయిల్ పామ్ గెలల సేకరణ**



**సంగారెడ్డి, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లాలోని రాయికోడ్, మొగుడంపల్లి, న్యాల్కల్, నారాయణఖేడ్ మండలాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో పంట కోత, గెలల సేకరణ, రవాణాపై అవగాహన కల్పించేందుకు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి పి. సోమేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రై రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని ఆయిల్ పామ్ రైతుల పొలాలను సందర్శించి, పంట గెలల కోతను ప్రత్యక్షంగా చేపట్టారు. పంట కోత, హార్వెస్టింగ్ పద్ధతులు, గెలల సేకరణ, లోడింగ్, రవాణా ప్రక్రియలపై రైతులకు వివరించారు. ఆయిల్ పామ్ గెలలను సరైన పద్ధతిలో కోయడంతో పాటు కోత అనంతరం సకాలంలో పరిశ్రమకు రవాణా చేయడం ద్వారా పంట నాణ్యతను కాపాడుకోవచ్చని, తద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ డ్రై రన్ కార్యక్రమంలో భాగంగా సుమారు 35 ఎకరాల్లో పంట కోత చేపట్టి, దాదాపు 10 టన్నుల ఆయిల్ పామ్ ఫ్రూట్ బంచెస్ (ఎఫ్ఎఫ్‌బీలు) సేకరించారు. పంట కోతలో నష్టాలను తగ్గించడం, సమర్థవంతమైన హార్వెస్టింగ్ విధానాలను ప్రోత్సహించడం, రైతులకు శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి పి. సోమేశ్వరరావు, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ జనరల్ మేనేజర్ స్వీటీ వేగుంట, అసిస్టెంట్ మేనేజర్ ఈశ్వర్ రెడ్డి, క్లస్టర్ లెవెల్ మేనేజర్ కొండలరావు, ఆయిల్ పామ్ రైతులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన



**మెదక్, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** మెదక్ జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు అనువైన భవనాలు, స్థలాలను గుర్తించే ప్రక్రియలో భాగంగా బుధవారం అధికారులు మెదక్ పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. రాజు, విద్యాశాఖ కోఆర్డినేటర్ రాజు ఈ పరిశీలనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ధ్యాన్‌చంద్ సర్కిల్ సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలను సందర్శించి, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అనువైన భవనాలు, అందుబాటులో ఉన్న స్థలాలను పరిశీలించారు. పాఠశాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, స్థల అనుకూలత తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంతో పాటు విద్యా అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయానికి అనువైన ప్రదేశాలను గుర్తించి, అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక వసతులకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన అంశాలు, స్థలాలకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు వెల్లడించారు.

# కాకతీయ యూనివర్సిటీలో టి సి ఏ యు-19 స్టేట్ లీగ్ -- 2026

**- తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. పెసరు విజయచందర్ రెడ్డి**



**మెదక్, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** బుధవారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టి సి ఏ యు-19 స్టేట్ లీగ్ -- 2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హనుమకొండ మాజీ ఎమ్మెల్యే జాతీయ కౌన్సిల్ సభ్యులు మార్తినేని ధర్మారావు మరియు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి బెల్లంపల్లి వైస్ భూపాలపల్లి ఆడడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు,నవరసన్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల సహాయంతో వృద్ధుడిని చేరదీసిన కన్నతల్లి అశ్రమం




**మెదక్, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గంలో ని ఖిల్లా వరంగల్ కోటలోని పరపతి సంఘము కార్యాలయంలో సుమారు 70 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడిని స్థానిక ప్రజలు గుర్తించి మిల్స్ కాలిని పోలీసులకు సమాచారం అందించారు వెంటనే పోలీసులు నవీన్ మహిళా కానిస్టేబుల్ స్వాతి అక్కడకు చేరుకుని వృద్ధుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు ఒక్కసారి కాజీపేట మరొక్కసారి నెక్కొండ అని పొంతన లేని సమాధానం చెబుతున్నాడు అని అన్నారు వెంటనే కన్నతల్లి వృద్ధా అశ్రయం చైర్మన్ కొండమీది రాజన్ బాబు సమాచారం అందించారు వృద్ధుడిని తీసుకొని 40 వ డివిజన్ ఉప్పారోని కుంట ప్రాంతంలో ఉన్నటువంటి కన్నతల్లి వృద్ధా అశ్రయంలో చేర్పించారు వృద్ధా అశ్రమ నిర్వహికులు కొండమీది రాజన్ బాబు మాట్లాడుతూ మిల్స్ కాలిని సర్కిల్ ఇన్స్పెక్టర్ కర్రె స్వామి ఆదేశాల మేరకు ఈ మతిస్థిమితం లేని వృద్ధుడిని మా అశ్రయంతీసుకుంటున్నాము అని అన్నారు

# బాలికల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన కార్యక్రమం**





**సంగారెడ్డి, అక్టోబర్ 15(సందేశం టైమ్స్):** అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డిలోని బాలసదన్‌లో బాలికలకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై బాలికలకు వివిధ చట్టాలు, హక్కులు, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలికలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. బాలికలు విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. బాలల హక్కులు, విద్యా హక్కు, బాల్యవివాహాల నిషేధం, పోక్సో చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అక్రమ రవాణా నివారణ వంటి అంశాలపై వివరించారు. బాలికలపై ఎలాంటి వేధింపులు, వివక్ష లేదా అన్యాయం జరిగినా మౌనంగా ఉండకుండా నమ్మకమైన పెద్దలు, సంబంధిత అధికారులు లేదా న్యాయ సహాయ సంస్థలను సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, మంచి స్పర్శ--చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తించాలని, అసౌకర్యం కలిగించే పరిస్థితులు ఎదురైతే వెంటనే బాధ్యతగల వ్యక్తులకు తెలియజేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, సైబర్ వేధింపుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాలికల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, పునరావాసానికి సంబంధించిన చట్టపరమైన అంశాలను వివరిస్తూ వారికి సురక్షితమైన వాతావరణం కల్పించాలని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ న్యాయ సహాయానికి దూరం కాకూడదని స్పష్టం చేశారు. అవసరమైన వారు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి న్యాయ సలహా, సహాయం పొందవచ్చని తెలిపారు. బాలికలు తమ ప్రతిభను గుర్తించి, లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుతూ సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు. బాలికల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం, తమ హక్కులను తెలుసుకునేలా చేయడం, అన్యాయం జరిగినప్పుడు సహాయం పొందే మార్గాలను వివరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, సమానత్వం, సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

# జర్నలిస్టులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**- జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం**



**సంగారెడ్డి, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్):** విధి నిర్వహణలో నిరంతరం శ్రమించే జర్నలిస్టులు తమ ఆరోగ్య పరిరక్షణకు తగిన ప్రాధాన్యమివ్వాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సన్‌రైజ్ ఆసుపత్రి సహకారంతో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సన్‌రైజ్ ఆసుపత్రిలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే పని ఒత్తిడి, సమయాభావం కారణంగా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు. జర్నలిస్టులు తమతోపాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు ఉచిత వైద్య సంప్రదింపులు అందించడంతోపాటు అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఎకో, రక్త పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గుండె, ఊపిరితిత్తులు, ఎముకలు, కీళ్లు, మధుమేహం, నాడీ సంబంధిత సమస్యలతోపాటు మహిళల ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే--ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైజల్ అలీ, జిల్లా అధ్యక్షుడు బండారి యాదగిరి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, సన్‌రైజ్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ స్వామి గౌడ్, రథసారథి తెలుగు దినపత్రిక సంపాదకుడు సంతోష్ గౌడ్, జర్నలిస్టు సంఘాల నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి ఏడేళ్ల జైలు

**మెదక్, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. ఈ విషయాన్ని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ బుధవారం వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇక్కిరి శ్రీశైలం (25) ఆటో డ్రైవర్‌గా, ప్లంబర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మెల్లూరు నుంచి తూప్రాన్‌కు ఆటో నడుపుతున్న సమయంలో కళాశాలకు వెళ్లేందుకు వేచి ఉన్న 17 ఏళ్ల బాలికను ఆటోలో ఎక్కించుకోవడంతో ఆమెతో పరిచయం ఏర్పడింది. అనంతరం ఇద్దరూ ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. కొంతకాలం తర్వాత బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నిందితుడు చెప్పగా ఆమె నిరాకరించింది. అయినప్పటికీ బాలికను బలవంతంగా తీసుకెళ్లాలని పథకం వేసిన నిందితుడు, 2021 ఏప్రిల్ 16న బాలిక కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లిన సమయంలో ఆమె ఇంటికి వెళ్లి బైక్‌పై రావాలని బలవంతం చేశాడు. బాలిక నిరాకరించడంతో కత్తితో బెదిరించి బాసర, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బాలిక తండ్రికి ఫోన్ చేసి తాను తూప్రాన్‌లో ఉన్నట్లు సమాచారం ఇవ్వడంతో ఆమె తండ్రి బాలికను ఇంటికి తీసుకెళ్లాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 2021 ఏప్రిల్ 27న ఎల్దుర్తి ఎస్ఐ మహేందర్ కేసు నమోదు చేశారు. అప్పటి తూప్రాన్ డీఎస్పీ కిరణ్ కుమార్ కేసును దర్యాప్తు చేసి అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.




# మానూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**నారాయణఖేడ్, అక్టోబర్ 14 (సందేశం టైమ్స్):** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మానూర్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి ప్రతిభ శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యత, ఆనందాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ఇలాంటి వేడుకల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణు సాగర్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఆర్ఐ ఖాజా కుతుబుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ ఖాజా మొయినుద్దీన్, మండల సమాఖ్య ఏపీఎం అనంతయ్య, సీసీలు వీర్ కుమార్, హడమండ్లు, సాయిలు, హనుమంత్ రెడ్డి, మండల సమాఖ్య అకౌంటెంట్ సంజీవ్, కంప్యూటర్ ఆపరేటర్ మీనా, వివిధ గ్రామాలకు చెందిన మహిళా సంఘాల అధ్యక్షులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రాంసాన్‌పల్లిలో శ్రీ అన్నపూర్ణ దేవిగా అమ్మవారి దర్శనం



**అందోల్, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామంలో భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ అన్నపూర్ణ దేవి కృపాకటాక్షాలతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారి దివ్య దర్శనాన్ని కనులారా వీక్షిస్తూ, 'ఓం శ్రీ మాత్రే నమః' మంత్రాన్ని జపించి అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హనుమంతు, ఉపసర్పంచ్ పృథ్వీరాజ్‌తో పాటు పట్లోళ్ల శివారెడ్డి, సార వర్మ, బోయిని గోపాల్, జోగేందర్, మల్లేష్ గౌడ్, శంకర్, మొగులయ్య, లక్ష్మణ్, శివకుమార్, శ్రీనివాస్, గోపాల్, శంకు, వెంకటేశం తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్‌పై పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో గిరిజన రైతు మృతి

**టెక్మాల్, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



మెదక్ జిల్లా టెక్మాల్ మండలం దండువానికుంట తండాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్‌పై పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై విస్లావత్ అనిల్ అనే గిరిజన రైతు మృతి చెందాడు. ఈ ఘటనతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే, దండువానికుంట తండాకు చెందిన రైతు విస్లావత్ అనిల్ విద్యుత్ శాఖ నుంచి ఎల్‌సీ తీసుకుని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు పనులు చేసేందుకు వెళ్లాడు. అక్కడ లైన్‌మెన్ సమక్షంలో నిచ్చెన సాయంతో ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి పనులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. విద్యుత్ సరఫరాను నిలిపివేయకుండా, తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే తమ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనిల్ మృతితో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అక్కడే ఉన్న హెల్పర్‌పై దాడికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి, ప్రమాదానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# పేద కుటుంబానికి అండగా నిలిచిన జీఎంఆర్ ఫౌండేషన్

**కల్హేర్, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మాలోత్ జైపాల్ కుటుంబానికి జీఎంఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం ఇంద్రనగర్ తాండకు చెందిన మాలోత్ జైపాల్ కొద్ది రోజుల క్రితం విద్యుత్ షాక్ తగిలి మృతి చెందడంతో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుల్లపు మచ్చేందర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన మచ్చేందర్ బాధిత కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించి, జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారి కష్టాల్లో భాగస్వాములవుతూ మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జీఎంఆర్ ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ సాగర్, ఇంద్రనగర్ గ్రామ ఉపసర్పంచ్ లక్ష్మణ్ నాయక్, యువ నాయకుడు సత్యనారాయణ, ఆర్ఎంపీ రమేష్ బాబు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశనాయక్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో వర్షిణికి స్వర్ణ పతకం

**స్వర్ణ పతకంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక**

**సంగారెడ్డి, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో సంగారెడ్డి జిల్లా తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. నారాయణపేట జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 బాలికల రెజ్లింగ్ పోటీల్లో పాఠశాలకు చెందిన నిరుడి వర్షిణి స్వర్ణ పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. సంగారెడ్డి మండలం అంగడిపేట గ్రామానికి చెందిన నిరుడి యాదయ్య, అనురాధ దంపతుల కుమార్తె వర్షిణి పాఠశాలలో 8వ తరగతి 'ఏ' సెక్షన్‌లో చదువుతోంది. అండర్-14 బాలికల 58 కిలోల విభాగంలో పోటీపడి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. అదే పాఠశాలకు చెందిన రిమ్షా సనోవర్ 50 కిలోల విభాగంలో రజత పతకం సాధించింది. విద్యార్థినులు ఒక స్వర్ణం, ఒక రజత పతకం సాధించడంతో పాఠశాలలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ హేమలత, పీఈటీ శ్రీవాణి, ఉపాధ్యాయ బృందం విద్యార్థినులను అభినందించారు. వర్షిణి జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# జోగిపేటలో ఘనంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు



**జోగిపేట, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**

సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం జోగిపేట పట్టణంలో స్నేహ సిరి యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గత 26 ఏళ్లుగా దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి మహదేవ్ గౌడ్, మహావీర్ గౌడ్, రాజా గౌడ్ దాతలుగా వ్యవహరించి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక సేవతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యమిస్తూ ఏటా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. దుర్గాదేవి విగ్రహాన్ని అందించిన శ్లోకం శర్వాణి పులుగు కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం నవరాత్రి ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తూ అన్నదాన కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. పులుగు నరసింహారావు, పులుగు గోపాల్ రావు, డాక్టర్ వీణ, వాణి, శీలా తదితరులు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు. గత 26 ఏళ్లుగా సంప్రదాయాన్ని కొనసాగిస్తూ దుర్గామాత ఆశీస్సులతో భక్తులకు అన్నప్రసాదం అందించడం పట్ల పట్టణ ప్రజలు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# బోరంచలో శ్రీ మంగళ గౌరీ దేవిగా నల్ల పోచమ్మ తల్లి దర్శనం

**మనూర్ మండల్ , అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం బోరంచ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు శ్రీ మంగళ గౌరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి అర్చనలు సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తుల సమక్షంలో అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అమ్మవారి దివ్య దర్శనం, ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు

**- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం బతుకమ్మ: కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, అక్టోబర్ 14 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



ప్రపంచంలో పూలతో జరుపుకునే అరుదైన పండుగ బతుకమ్మ అని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీత పాల్గొని బతుకమ్మ పూజలు నిర్వహించి, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. బతుకమ్మను తెలంగాణ ఇంటి మహాలక్ష్మిగా భావిస్తారని పేర్కొన్నారు. పండుగ విశిష్టతను చాటిచెప్పేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అక్టోబర్ 14 నుంచి 17వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు, యువత, మహిళా ఉద్యోగులు, స్థానిక మహిళలు, కలెక్టరేట్ పరిసర కాలనీల వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. వివిధ శాఖల భాగస్వామ్యంతో బతుకమ్మ సంబురాల నిర్వహణకు రోజువారీ షెడ్యూల్ రూపొందించినట్లు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీ వరకు కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించనున్న వేడుకల్లో వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.

# జోగిపేటలో ఘనంగా ధమ్మ దీక్ష దివస్

**- కులవివక్ష నిర్మూలనకు బౌద్ధ ధమ్మ మార్గం దోహదం**

**- సమానత్వం, కరుణ, సామాజిక న్యాయమే ధమ్మ దీక్ష సందేశం**

**జోగిపేట, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**



డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించిన అక్టోబర్ 14ను పురస్కరించుకుని ఆందోల్ మండలానికి చెందిన దళిత సంఘాల నాయకులు జోగిపేటలో ధమ్మ దీక్ష దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ధమ్మ దీక్ష అనేది కేవలం మత స్వీకరణ మాత్రమే కాదని, శతాబ్దాలుగా కొనసాగుతున్న కులవివక్షను ప్రశ్నిస్తూ ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం వైపు అడుగులు వేయడమని పేర్కొన్నారు. ప్రతి మనిషిని గౌరవించడం, అందరికీ సమాన హక్కులు కల్పించడం, కులవివక్ష లేని సమాజాన్ని నిర్మించడం అంబేద్కర్ చూపిన బౌద్ధ ధమ్మ మార్గంలోని ప్రధాన సందేశాలని తెలిపారు. 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ లక్షలాది మంది అనుచరులతో కలిసి బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించి చారిత్రాత్మక అడుగు వేశారని గుర్తుచేశారు. బౌద్ధ ధమ్మాన్ని ఆచరించడం ద్వారా ప్రజ్ఞ, కరుణ, సమానత్వం, నైతిక జీవనం, సామాజిక న్యాయం వంటి విలువలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మ్యాతరి కరుణాకర్ మాట్లాడుతూ భగవాన్ గౌతమ బుద్ధుడు బోధించిన అహింస, సత్యం, దొంగతనానికి దూరంగా ఉండటం, అపరిగ్రహం వంటి నైతిక విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. బుద్ధుడు బోధించిన అష్టాంగ మార్గాన్ని అనుసరించడం ద్వారా వ్యక్తిగత జీవితంలో ఉన్నత విలువలను పెంపొందించుకోవడంతోపాటు సమాజంలో సానుకూల మార్పును తీసుకురావచ్చని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పండుగల సందర్భంగా ఆర్టీసీ టికెట్ల ధరల పెంపును నిలిపివేయాలి

**మెదక్, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి):**





పండుగల సందర్భంగా ఆర్టీసీ బస్సు టికెట్ల ధరలను పెంచే విధానాన్ని ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మెదక్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ పరమేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పండుగ సమయంలో ఆర్టీసీ బస్సు టికెట్ల ధరలను పెంచడం వల్ల ప్రయాణికులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని అన్నారు. సంక్రాంతి, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి, బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సందర్భంగా ప్రత్యేక బస్సుల పేరుతో అధిక ఛార్జీలు వసూలు చేయడం వల్ల సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. సాధారణ రోజుల్లో ఉన్న టికెట్ ధరలతో పోలిస్తే పండుగల సమయంలో అధిక ఛార్జీలు వసూలు చేయడం వల్ల ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలులో ఉన్నప్పటికీ, టికెట్ల ధరల పెంపు వల్ల ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధానాలను ప్రభుత్వం పునఃపరిశీలించాలని కోరారు. ప్రస్తుతం బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆర్టీసీ బస్సు టికెట్ల ధరలను పెంచకుండా సాధారణ ఛార్జీలతోనే ప్రయాణికులకు సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ. మల్లేశం, కె. మల్లేశం, పార్టీ సభ్యులు దుర్గ, షౌకత్, వెంకట్, దాసు, కవిత తదితరులు పాల్గొన్నారు.

# నాగులవంచ గడీ సెంటర్‌లో ఘనంగా మహా అన్నదానం

**చింతకాని, అక్టోబర్ 15 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్):**

ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని గడీ సెంటర్‌లో మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తి, సేవాభావానికి ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమంలో చింతకాని ఎస్ఐ జి. నరేష్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొప్పుల గోవిందరావు, చింతకాని మండల ప్రెస్ క్లబ్ సభ్యులు, భవానీ స్వాములు, గ్రామ ప్రజలు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు, ప్రజలు అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములై భక్తిశ్రద్ధలతో సేవలందించారు. 'అన్నదానం మహాదానం' అనే సందేశాన్ని చాటుతూ ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మానవత్వానికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. నాగులవంచ గడీ సెంటర్‌లో నిర్వహించిన ఈ మహా అన్నదాన కార్యక్రమం భక్తి, సేవ, మానవత్వం కలగలిసిన వేడుకగా నిలిచింది.



# కామారెడ్డిలో ఈ నెల 24న ఆర్థిక ఆధారిత రిజర్వేషన్లపై భారీ బహిరంగ సభ..

**– ప్రవీణ్ అరోరా రథయాత్రకు ఘన స్వాగతం పలకాలి: రెడ్డి ఐక్యవేదిక నాయకులు**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
దేశవ్యాప్తంగా ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల అమలుపై అవగాహన కల్పించేందుకు సామాజిక కార్యకర్త ప్రవీణ్ అరోరా చేపట్టిన రథయాత్ర ఈ నెల 24న కామారెడ్డికి చేరుకోనుంది. ఈ సందర్భంగా కామారెడ్డిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పేదలు, బలహీన వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు జూకంటి మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు.రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి రెడ్డి సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రిజర్వేషన్ల ప్రయోజనాలు అర్హులైన పేదలకు అందేలా ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల అమలుపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పించడమే యాత్ర ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అక్టోబర్ 2న ప్రారంభమైన ఈ రథయాత్ర దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల్లో సుమారు 20 వేల కిలోమీటర్ల మేర కొనసాగనుందని వెల్లడించారు.అక్టోబర్ 23 రాత్రి తెలంగాణలోకి ప్రవేశించే రథయాత్ర, అక్టోబర్ 24న ఆదిలాబాద్ జిల్లా నుంచి నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్ మీదుగా కామారెడ్డికి చేరుకుంటుందని పేర్కొన్నారు. కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభలో ప్రవీణ్ అరోరా పాల్గొంటారని తెలిపారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సమాన అవకాశాలు కల్పించే విధానాలు అవసరమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు అన్ని వర్గాల్లోని పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రథయాత్ర కొనసాగుతోందని నాయకులు వివరించారు. గ్రామీణ ప్రాంతాల నిరుపేదలు, బలహీన వర్గాల ప్రజలు సభకు హాజరై తమ మద్దతు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక వ్యవస్థాపకుడు ఏనుగు సంతోష్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు జూకంటి మోహన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాజకుమార్ రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర



కార్యదర్శి కొలిమి భీంరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, కార్యదర్శి ఆరెపల్లి మల్లారెడ్డి, నగర, మండల అధ్యక్షులు రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, వెంకటరెడ్డి, నర్సారెడ్డి, మోహన్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రతాప్ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కందడి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ నెల 24న కామారెడ్డిలో జరిగే బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని రెడ్డి ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు.

# రోగరహిత సమాజ నిర్మాణం మహిళల ఆరోగ్యంతోనే సాధ్యం..

**-వర్నిలో 30 పడకల ఏరియా ఆసుపత్రి ప్రారంభం**
**-ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం: పోచారం**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
వర్ని మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నూతనంగా నిర్మించిన 30 పడకల ఏరియా ఆసుపత్రిని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. మంగళవారం ఆసుపత్రి భవనంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి పాల్గొని ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో వైద్యుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వర్ని ప్రాంత ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ ఆసుపత్రి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్, ఆర్థోపెడిక్ తదితర అనారోగ్య సమస్యలకు వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.గర్భిణులకు స్థానికంగానే ప్రసూతి సేవలు గతంలో ప్రసూతి వైద్యం కోసం బోధన్, నిజామాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం వర్నిలోనే ప్రసూతి వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు ఎంతో ఊరట కలుగుతుందని అన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కుటుంబ సభ్యులు కూడా గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, ఆరోగ్యవంతమైన కుటుంబాలతోనే రోగరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, సరైన ఆహారపు అలవాట్లు పాటించడం ముఖ్యమని



వివరించారు.వర్ని ఏరియా ఆసుపత్రి ద్వారా మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలని, ముఖ్యంగా పేద, సామాన్య ప్రజలకు ఈ ఆసుపత్రి ప్రయోజనకరంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి బద్దం రాజశ్రీ, డీసీహెచ్ శ్రీనివాస ప్రసాద్, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా, ఎరువాల కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ రవి కనకదుర్గ, మాజీ సొసైటీ చైర్మన్ వీర్రాజు, మాజీ జెడ్పీటీసీ హరిదాస్, వెలగపూడి గోపాల్, జకోరా మాజీ సొసైటీ చైర్మన్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.
1

# బతుకమ్మ సంబరాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలి..

**-తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.కామారెడ్డి జిల్లాలో జిల్లా యువజన, క్రీడల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. తొలుత కొబ్బరికాయ కొట్టి వేడుకలను ప్రారంభించిన ఆయన,





అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆటలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధిస్తూ వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఇటువంటి సాంస్కృతిక వేడుకలు ప్రజల్లో ఐక్యతను, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ బతుకమ్మ వేడుకల్లో భాగస్వాములై తెలంగాణ సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణ కలెక్టర్ రవితేజ, జిల్లా పంచాయతీ అధికారి మురళి, జిల్లా మద్య నిషేధ శాఖ అధికారి ముకుంద రెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేవేందర్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రంగ వెంకటేశ్వర గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దామోదర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బీబీపేటలో భైరవి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక హోమం..

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం బీబీపేట్ మండల కేంద్రంలో భైరవి యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి సన్నిధిలో హోమ కార్యక్రమం వైభవంగా సాగింది. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఈ హోమాన్ని నిర్వహించినట్లు భైరవి యూత్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో భైరవి యూత్ సభ్యులతో పాటు స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**– కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి**
**– పాత పాల్వంచ మెప్మా సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న – విమలాదేవి**



(సందేశం టైమ్స్ ప్రతినిధి):
మహిళలు అన్ని రంగాల్లో రాణించి, అభివృద్ధి చెందాలని పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. పాత పాల్వంచ గడియకట్ట లో బుధవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ( మెప్మా ), కరుణశ్రీ పేద ప్రాంత సమాఖ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా: పాల్గొన్న కార్పొరేటర్ విమలాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు చేపడుతున్నదని, మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విమలాదేవిని మహిళా సమాఖ్య సభ్యులు ఘనంగా సత్కరించారు . ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ బి. సరిత, ఆర్.పి. వై. అరుణ కుమారి, కరుణశ్రీ సమాఖ్య అధ్యక్షురాలు జి. ఆదిలక్ష్మి, కార్యదర్శి షేక్ షాహీన్, కోశాధికారి ఎస్. కనకరాణి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## 'పల్లెకో ప్రతినిధి' కార్యక్రమానికి శ్రీకారం తొలి కమిటీ ఏర్పాటు..

**– చేసిన కోడిప్యాక సాయిరాంకు ప్రశంసా పత్రం**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన 'పల్లెకో ప్రతినిధి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా




గ్రామస్థాయిలో తొలి కమిటీని ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కోడిప్యాక సాయిరాంను సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ అభినందించారు. సంస్థ లక్ష్యాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు చేసిన కృషిని ప్రశంసిస్తూ ఆయనకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటుకు తొలి అడుగు వేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు పొందగల హక్కులు, ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించడంలో 'పల్లెకో ప్రతినిధి' కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.కోడిప్యాక సాయిరాం స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటును విస్తరించాలని, సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు సంస్థ లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ చంటి ముదిరాజ్ పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమ్ముల రాజేశ్వర్ మృతి..

**-కుటుంబాన్ని పరామర్శించిన డీసీసీ ప్రధాన కార్యదర్శి**

(సందేశం టైమ్స్ ప్రతినిధి):
నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం న్యావనంది గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమ్ముల రాజేశ్వర్ ఇటీవల గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందారు. ఈ నేపథ్యంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి



వెలుమల భాస్కర్ రెడ్డి బుధవారం రాజేశ్వర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాజేశ్వర్ మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

సందేశం టైమ్స్
15-10-2026

# ఎన్.హెచ్.ఎం. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..

-సమాన పనికి సమాన వేతనం కల్పించాలి
-కలెక్టరేట్ సమీపంలో రెండో రోజూ కొనసాగిన ఎన్.హెచ్.ఎం.ఉద్యోగుల సమ్మె

(సందేశం టైమ్స్ ప్రతినిధి):



కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్.హెచ్.ఎం.) ఉద్యోగులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. గత 25 ఏళ్లుగా ఎన్.హెచ్.ఎం. పరిధిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 13 నుంచి సమ్మె బాట పట్టారు.ఈ సమ్మెలో స్వీపర్ల నుంచి ఏఎన్‌ఎంలు, రెండో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యులు, ఆయుష్ వైద్యులు, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈఓలు) తదితర మొత్తం 76 కేడర్లకు చెందిన ఉద్యోగులు పాల్గొంటున్నారు. ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని వారు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.ప్రజారోగ్య సేవల్లో ఎన్నో సంవత్సరాలుగా కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు, న్యాయమైన వేతనాలు అందడం లేదని పేర్కొన్నారు

# కామారెడ్డి జిల్లా దళిత మోర్చా నూతన కార్యవర్గం ఏర్పాటు..

-దళితుల సమస్యలపై నిరంతరం పోరాడాలి: జిల్లా అధ్యక్షుడు రేవన్

(సందేశం టైమ్స్ ప్రతినిధి):



BHARATIYA JANATA PARTY
SC MORCHA KAMAREDDY DIST COMMITTEE - 2026
పత్రికా ప్రకటన.

| S.No | Designation | Name | Assembly | Mobile Number |
|---|---|---|---|---|
| 1 | Vice-President | Dandu Raju | Kamareddy | [illegible] |
| 2 | Vice-President | Sandi Sai Ram | Kamareddy | [illegible] |
| 3 | Vice-President | S. Laxmi | Banswada | [illegible] |
| 4 | Vice-President | Gantha Madhu | Kamareddy | [illegible] |
| 5 | General Secretary | Sunkari Naresh | Kamareddy | [illegible] |
| 6 | General Secretary | Swamy | Kamareddy | [illegible] |
| 7 | Secretary | Maruthi | Jukkal | [illegible] |
| 8 | Secretary | Ranjith G | Banswada | [illegible] |
| 9 | Secretary | Mala Subash | Kamareddy | [illegible] |
| 10 | Secretary | Mass Srinivasulu | Kamareddy | [illegible] |
| 11 | Treasurer | Patala Salamy | Kamareddy | [illegible] |
| 12 | Media Convener | Mallepalli Santosh | Kamareddy | [illegible] |
| 13 | Social Media Convener | Methri Sailu | Kamareddy | [illegible] |
| 14 | District Executive Member | Damini Ramulu | Kamareddy | [illegible] |
| 15 | District Executive Member | Meesale Laxman | Kamareddy | [illegible] |
| 16 | District Executive Member | Yerradurgayya | Kamareddy | [illegible] |
| 17 | District Executive Member | Namivar Vital | Kamareddy | [illegible] |
| 18 | District Executive Member | Babu Maharaj | Kamareddy | [illegible] |
| 19 | District Executive Member | Damini Ramulu | Yellareddy | [illegible] |

S. Revan
9866982551
SC Morcha Kamareddy Dist President

కామారెడ్డి జిల్లాలో బీజేపీ దళిత మోర్చా (ఎస్సీ మోర్చా) నూతన జిల్లా కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు రేవన్ ప్రకటించారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు ఆదేశాల మేరకు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రేవన్ మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత మార్పుల్లో భాగంగా జిల్లాలోని మండల కమిటీల ఏర్పాటు అనంతరం ముఖ్య నాయకులతో చర్చించి జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. నూతన కార్యవర్గ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.నూతనంగా నియమితులైన నాయకులు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ, దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. దళితుల్లో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రజాక్షేత్రంలో చురుకుగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రేవన్ పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో ఎస్సై సతీష్ కుమార్‌కు తీవ్ర గాయాలు హైదరాబాద్‌కు తరలింపు

(సందేశం టైమ్స్ ప్రతినిధి):



సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల రామగిరి వద్ద ఘోర ప్రమాదం ఎస్సై పరిస్థితి విషమం విధులకు వెళ్తుండగా ప్రమాదం మిర్యాలగూడ టూ టౌన్ ఎస్సైకి తీవ్ర గాయాలుఎస్సై సతీష్ కుమార్‌కు ప్రమాదం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపురామగిరి వద్ద రోడ్డు ప్రమాదం ఎస్సై ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలింపు పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలింపుఎస్సైకు ప్రమాదం అని తెలిసి ఆస్పత్రికి చేరుకుని పరామర్శించిన డీఎస్పీ రవి. నేరేడుచర్ల--మిర్యాలగూడ మార్గంలో ప్రమాదం ఎస్సైకు తీవ్ర గాయాలు విధులకు వెళ్తున్న ఎస్సైకి ప్రమాదం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది రామగిరి వద్ద ఏం జరిగింది రోడ్డు ప్రమాదంలో ఎస్సై సతీష్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడం జరిగింది.

# ఫోన్‌లోనే ధైర్యం చెప్పి.. నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులు..

-దేవునిపల్లి, రామారెడ్డి పోలీసుల సమన్వయంతో ఆత్మహత్యాయత్నం విరమణ

(సందేశం టైమ్స్ ప్రతినిధి):

కామారెడ్డి జిల్లా పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ప్రాణాలను కాపాడారు. వ్యక్తిగత సమస్యలతో మనస్తాపానికి గురై రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైన వ్యక్తికి ఫోన్‌లోనే ధైర్యం చెబుతూ, దేవునిపల్లి, రామారెడ్డి పోలీసులు సమన్వయంతో వ్యవహరించి అతడిని సురక్షితంగా ఇంటికి చేర్చారు. కామారెడ్డి జిల్లా పోసానిపేట్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యక్తిగత సమస్యలతో తీవ్ర మనోవేదనకు గురై అడ్లూరు శివారులోని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నిస్తున్నట్లు డయల్ 112కు సమాచారం అందింది. దీంతో వెంటనే స్పందించిన దేవునిపల్లి పోలీస్ సిబ్బంది పీసీ రమేష్, హెచ్‌జీ భూపతి బాధితుడికి ఫోన్ చేసి




నిరంతరం మాట్లాడారు. అధైర్యపడవద్దని ధైర్యం చెబుతూ ఆత్మహత్య ఆలోచనను విరమించుకునేలా ప్రయత్నించారు.అదే సమయంలో రామారెడ్డి పెట్రోల్ కార్ ఏఎస్ఐ పందిరి గౌడ్‌తో సమన్వయం చేసుకుంటూ సాంకేతిక సమాచారం ఆధారంగా బాధితుడి ఆచూకీ గుర్తించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని సముదాయించి ఆత్మహత్యాయత్నాన్ని విరమింపజేశారు. అనంతరం రామారెడ్డి పెట్రోల్ కార్ సిబ్బంది సహకారంతో బాధితుడిని సురక్షితంగా ఇంటికి చేర్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు సకాలంలో స్పందించి ఓ నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్, కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైనదని, వ్యక్తిగత సమస్యలు, ఒత్తిళ్లు ఎదురైనప్పుడు కుంగిపోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులతో తమ బాధను పంచుకోవాలని సూచించారు. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని పేర్కొన్నారు. తమ చుట్టూ ఎవరైనా ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతున్నట్లు గుర్తిస్తే వారికి ధైర్యం చెప్పి అవసరమైన సహాయం అందించాలని కోరారు.ఆపదలో ఉన్నవారు తక్షణ సహాయం కోసం డయల్ 112కు ఫోన్ చేయవచ్చని, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కామారెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ తెలిపారు. 6

# రోగులు త్వరగా కోలుకునేలా ఆధునిక వైద్య సేవలు..

-రోబోటిక్, లాపరోస్కోపిక్ సర్జరీలతో మెరుగైన ఫలితాలు

(సందేశం టైమ్స్ ప్రతినిధి):

క్యాన్సర్ బాధితులకు అత్యాధునిక వైద్య సాంకేతికతతో ఖచ్చితమైన చికిత్సలు అందించడమే లక్ష్యంగా యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ శాఖ ప్రత్యేక వైద్య సేవలను అందిస్తోంది. ఆధునిక శస్త్రచికిత్సా పద్ధతులు, వివిధ వైద్య విభాగాల నిపుణుల సమన్వయంతో రోగుల ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా సమగ్ర క్యాన్సర్ చికిత్సను అందిస్తోంది. క్యాన్సర్ చికిత్సలో లాపరోస్కోపిక్, రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీ విధానాలు కీలక పురోగతిగా నిలుస్తున్నాయి. ఈ ఆధునిక సాంకేతికతతో చిన్న కోతల ద్వారానే క్లిష్టమైన శస్త్రచికిత్సలను అధిక ఖచ్చితత్వంతో నిర్వహించే అవకాశం కలుగుతోంది. గ్యాస్ట్రోఇంటెస్టినల్, కొలొరెక్టల్, బ్రెస్ట్, గైనకాలజికల్ తదితర క్యాన్సర్ల చికిత్సలో ఈ విధానాలను వినియోగిస్తున్నారు. ఆరోగ్యకరమైన కణజాలానికి సాధ్యమైనంత తక్కువ నష్టం కలిగిస్తూ క్యాన్సర్ కణతులను తొలగించడం, రోగులు త్వరగా కోలుకునేలా చూడటం ఈ విధానాల ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ శాఖ సీనియర్ కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్, లాపరోస్కోపిక్, రోబోటిక్ ఆంకో సర్జన్ డాక్టర్ వై. యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం క్యాన్సర్ చికిత్సలో రోగి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా ప్రత్యేక చికిత్సా ప్రణాళిక రూపొందించడం, మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలను వినియోగించడం ప్రాధాన్యత సంతరించుకున్నాయని తెలిపారు. క్యాన్సర్‌ను సమర్థంగా నియంత్రించడంతో పాటు సాధ్యమైనంత వరకు శరీర అవయవాల పనితీరును, రోగుల జీవన ప్రమాణాలను కాపాడటం తమ లక్ష్యమని పేర్కొన్నారు. రోబోటిక్, లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలతో పాటు వివిధ వైద్య విభాగాల నిపుణుల సమన్వయం ద్వారా సంక్లిష్టమైన క్యాన్సర్లకు మరింత ఖచ్చితమైన చికిత్స అందించే అవకాశం ఉందని వివరించారు.సర్జికల్, మెడికల్, రేడియేషన్



ఆంకాలజీ విభాగాల్లో అనుభవజ్ఞులైన నిపుణులతో క్యాన్సర్ నిర్ధారణ నుంచి చికిత్స ప్రణాళిక, శస్త్రచికిత్సలు, చికిత్స అనంతర సంరక్షణ వరకు యశోద హాస్పిటల్స్ సమగ్ర వైద్య సేవలను అందిస్తోంది. ఆధునిక సాంకేతికత, నిపుణుల సేవలు, సమన్వయంతో కూడిన వైద్య విధానాల ద్వారా క్యాన్సర్ బాధితులకు మెరుగైన చికిత్సా అవకాశాలను అందించేందుకు కృషి చేస్తోంది.

# హైకోర్టు తీర్పుతో న్యాయంపై నమ్మకం మరింత బలపడింది: వట్టే జానయ్య యాదవ్

(సందేశం టైమ్స్ ప్రతినిధి):

రైస్ మిల్లుపై ఆరోపణల కేసులో కోర్టు పునర్విచారణకు ఆదేశాలు ఇచ్చిందన్న వట్టే జానయ్య యాదవ్ అధికారులు వాస్తవ లెక్కలతో విచారణ జరపాలి.. రైతుల పక్షాన మా పోరాటం కొనసాగుతుందివజ్రా రైస్ ఇండస్ట్రీస్, వజ్ర వికాస్ రైస్ ఇండస్ట్రీస్‌కు సంబంధించిన వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేసిందని వజ్రా రైస్ ఇండస్ట్రీస్ అధినేత వట్టే జానయ్య యాదవ్ అన్నారు. తనపై, తన కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కోర్టులో జరిగిన విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ, వాస్తవాలను వెలికితీసేందుకు నిష్పక్షపాతంగా పునర్విచారణ జరగాలని ఆయన కోరారు.గత జూలై 23 నుంచి తమ రైస్ మిల్లుల వ్యవహారంలో అనేక పరిణామాలుచోటుచేసుకున్నాయని జానయ్య యాదవ్ తెలిపారు. సివిల్ సప్లైస్, పోలీసు శాఖల అధికారులు తమపై తప్పుడు ఆరోపణలు చేశారని, మిల్లులోకి తాము, తమ సిబ్బంది వెళ్లకుండా అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. కోర్టుకు ఒక విధంగా సమాచారం ఇస్తూ, క్షేత్రస్థాయిలో మరో విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.
వాస్తవ లెక్కలతో విచారణ జరపాలి రైస్ మిల్లింగ్‌కు సంబంధించిన వ్యవహారంలో తొలుత ఎసెన్షియల్ కమాడిటీస్ చట్టం కింద విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉండగా, తమపై నేరుగా క్రిమినల్ కేసులు నమోదు చేశారని జానయ్య యాదవ్ ఆరోపించారు. ఈ కేసుల కారణంగా తాను, తన కుటుంబ సభ్యులు, మిల్లులో పనిచేసే గుమస్తాలు, సూపర్‌వైజర్లు, అకౌంటెంట్లు, మేనేజర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారని



చెప్పారు.తమ మిల్లుకు సంబంధించిన లెక్కలను వాస్తవ ఆధారాలతో పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపితే పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. తప్పుడు లెక్కలు, నిరాధార ఆరోపణల ఆధారంగా ఎవరినీ ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులను కోరారు.

# 22 వార్డులో పట్టభద్రుల ఏమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియ

(సందేశం టైమ్స్ ప్రతినిధి):

మాజీ మంత్రివర్యులు సూర్యపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి నాయకత్వంలో వారి ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ మున్సిపల్ పరధిలో స్థానిక 22వ వార్డులో గ్రాడ్యుయేట్ ఏమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు ప్రక్రియలో అర్హులైన ఓటర్ల నుండి వివరాలను నమోదు చేస్తున్న 22వ వార్డు ఏమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ మోత్కూరి సందీప్, ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



